తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలి

జటప్రోలులో రైతుల రాస్తారోకో

పెంట్లవెల్లి, మే13 : తడిచిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోలులో పెబ్బేరు-కొల్లాపూర్ రోడ్డుపై మంగళవారం రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ అధికారులు రైస్‌మిల్లర్లుతో చేతులు కలిపి రెండు నెలల నుంచి తేమ పేరుతో ధాన్యాన్ని కాంటా వేయడంలేదని ఆరోపించారు. ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షానికి ధాన్యం మొత్తం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సై రామన్‌గౌడ్, ఏపీఎం గౌస్ చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో రోడ్డుపై అడ్డంగా బైకులను నిలిపి రాస్తారోకో చేస్తున్న రైతులు

వీపనగండ్లలో రైతుల రాస్తారోకో

తహసీల్దార్‌ను నిలదీసిన కర్షకులు

వీపనగండ్ల, మే 13 : ధాన్యం కొనుగోలులో అధికారులు, ఐకేపీ సిబ్బంది నిర్లక్ష్యంపై వనపర్తి జిల్లా వీపనగండ్ల బస్టాండ్ ఆవరణలో రైతులు రాస్తారోకో చేపట్టారు. తాలు పేరుతో 40 కేజీల బస్తాకు 3 కేజీలపైన తరుగు తీస్తున్నారని ఆవేదన చెందారు. అదే మార్గంలో వెళ్తున్న తహసీల్దార్ వరలక్ష్మి వాహనాన్ని అడ్డుకొని నిలదీశారు. స్పందించిన ఆమె సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

వనపర్తి జిల్లా పెబ్బేరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధాన్యం అమ్మేందుకు రైతుల గోస

రాస్తారోకో చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

పెబ్బేరు, మే 13 : కాంగ్రెస్ ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అరిగోస పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పెబ్బేరులోని సుభాష్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా గన్నీ బ్యాగులు.. లారీలు లేవంటూ ఇబ్బందుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. తూకం వేసే క్రమంలో తరుగు తీస్తున్నారని ఆవేదనచెందారు.

ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో అధికారులను నిర్బంధించిన రైతులు

అధికారుల నిర్బంధం

ధాన్యాన్ని అధిక తూకం వేస్తున్నారని రైతుల ఆందోళన

ఖానాపూర్, మే 13 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అధిక తూకం వేస్తున్నారని రైతులు నిర్వాహకులను గదిలో నిర్బంధించారు. నిబంధనలకు విరుద్ధంగా తూకం వేస్తున్నారని మంగళవారం సీఈవో భూమి ఆశన్న, కొనుగోలు కేంద్ర నిర్వాహకుడు రాజేశ్వర్‌రెడ్డిని గదిలో బంధించారు. పోలీసులు, డీసీవో పాపయ్య చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రాలిన మట్టిపూలు 497

మరో రైతు ఆత్మహత్య

- అప్పుల భారంతో మనస్తాపం
- కరీంనగర్ జిల్లాలో విషాదం

కట్కూరి సారేందర్

వీణవంక, మే 13: వ్యవసాయంలో దిగుబడులు రాక.. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఓరైతు లు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఘన్ముక్ల గ్రామానికి చెందిన సారేందర్‌రెడ్డి (53) తన రెండెకరాలతోపాటు మరో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. వ్యవసాయంలో నష్టంరావడంతో రూ.5 లక్షల వరకు అప్పులయ్యా యి. అప్పులబాధ భరించలేక తీవ్రమైన మనోవేదనకు గురై, మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. సారేందర్‌రెడ్డి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సాయికృష్ణ తెలిపారు.

కూలీలుగా మారిన మాజీ సర్పంచ్ దంపతులు

- అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి
- బిల్లుల కోసం ఎదురుచూపులు
- కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం.. అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు

ఉపాధి హామీ పనులు చేస్తున్న పులిగిల్ల తాజా మాజీ సర్పంచ్ సదానందం

పరకాల, మే 13: పదవిలో ఉన్నప్పుడు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేపట్టిన సర్పంచ్‌లు వాటి బిల్లుల కోసం ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నారు. తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తాజా మాజీ సర్పంచ్‌లు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. హనుమకొండ జిల్లా నడికుడ మండలం పులిగిల్ల గ్రామ తాజా మాజీ సర్పంచ్ పాలకుర్తి సదానందం దంపతులు బిల్లులు రాని కారణంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉపాధి హామీలో కూలీ పనులకు వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు

బీఆర్ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. శ్మశానవాటికల నిర్మాణాలు, పల్లె ప్రకృతి వనాలు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు, సీసీ రోడ్లు తదితర పనుల కోసం గ్రామాలకు లక్షలాది రూపాయల నిధులు కేటాయించారు. దీంతో గ్రామాల్లో పనులు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తే మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో లక్షల రూపాయలు అప్పులు తెచ్చిమరీ పనులు చేశారు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక మాజీ సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్యే శరణ్యం

లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లుల చెల్లింపులు ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల దాకా బిల్లులు రావాల్సి ఉన్నది. వడ్డీలు పెరిగిపోతున్నాయి. ప్రతినెలా వడ్డీ చెల్లించలేని దుస్థితిలో ఉన్నా. ప్రభుత్వం మారిన నాటి నుంచి వడ్డీలకే రూ.4 లక్షలు చెల్లించాను. ప్రభుత్వం బిల్లులు చెల్లించాలి. లేదంటే ఆత్మహత్యే శరణ్యం.

– పాలకుర్తి సదానందం, తాజా మాజీ సర్పంచ్, పులిగిల్ల గ్రామం,

సిరిసిల్లలో రోడ్డెక్కిన రైతులు

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై బైఠాయించిన రైతులు

- కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కాంటా పెడ్తలేరని ఆందోళన

సిరిసిల్ల రూరల్, మే 13: కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కాంటా పెడ్తలేరని రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి, ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జిల్లెల్లకు చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డీఎస్పీ పార్థసారథి ఇంట్లో 90 బుల్లెట్లు!

ఏసీబీ దాడుల్లో అక్రమ నిల్వలు

హయత్‌నగర్/ నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 13 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట డీఎస్పీ కొండం పార్థసారథి ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్లతోపాటు అక్రమంగా దాచిన 90 బుల్లెట్లను స్వాధీనం చేసుకుని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న కొండం పార్థసారథి హయత్‌నగర్‌లోని దత్తాత్రేయనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సూర్యాపేట-2 పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసులో డీఎస్పీ పార్థసారథితోపాటు సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో పీ వీరరాఘవులు నిందితుల నుంచి రూ.25 లక్షలు డిమాండ్ చేసినట్టు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు అందింది. మంగళవారం పార్థసారథి ఇంటిపై ఏసీబీ హైదరాబాద్ సిటీ రేంజ్-2 ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మురళీమోహన్, టీం సభ్యులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 21లైవ్ రౌండ్లు, 69 ఖాళీ కాట్రిడ్జ్‌లు, ఒక కాట్రిడ్జ్‌ల స్టాండ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజ్ గౌడ్ తెలిపారు. పార్థసారథితోపాటు వీరరాఘవులును నాంపల్లిలోని ఏసీబీ కోర్టు ఎదుట ఏసీబీ అధికారులు హాజరుపర్చగా, ఇన్‌చార్జి జడ్జీ రఘురామ్ 14రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. రూ.25 లక్షల లంచం డిమాండ్ చేసి, రూ.16 లక్షలు ఇవ్వాలని పట్టుబట్టారంటూ ఫిర్యాదుదారుడు చేసిన ఫిర్యాదు మేరకు వీరిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్టు ఏసీబీ అధికారులు కోర్టుకు తెలిపారు.

ధాన్యం బకాయిలు 3,328 కోట్లు

- బోనస్ పెండింగ్ 767 కోట్లు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు రూ. 3,328 కోట్ల బకాయిలున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సన్న ధాన్యం బోనస్ కింద రైతులకు రూ.767 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ.. ఇప్పటి వరకు రైతుల నుంచి 43.10 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఇందులో 27.75 లక్షల టన్నులు దొడ్డు వడ్లు కాగా, 15.35 లక్షల టన్నులు సన్నరకమని తెలిపారు. రైతులకు రూ.9,999.36 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.6,671 కోట్లు చెల్లించామని పేర్కొన్నారు. బోనస్ కింద రూ.767 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు.

గొంతులో మటన్‌బొక్క ఇరుక్కొని వృద్ధుడి మృతి

మరిపెడ, మే 13 : గొంతులో మటన్‌బొక్క ఇరుక్కొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాలో చోటుచేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట శివారు డీసీ తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్ (68) కొత్త తండాలో దుర్గామాత పండుగ కోసం బంధువుల ఇంటికి వచ్చాడు. భోజనం చేసే క్రమంలో మటన్‌బొక్క గొంతులో ఇరుక్కోవడంతో ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు.

చెరువులో ఐదుగురు చిన్నారుల గల్లంతు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): చెరువులో దిగిన ఐదుగురు చిన్నారులు గల్లంతైన ఘటన ఏపీలోని కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మల్లేపల్లిలో చోటుచేసుకుంది. చెరువు గట్టుపై ఉన్న దుస్తులను చూసి చెరువులో చిన్నారులు మునిగిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని తరుణ్, చరణ్, పార్థ, హర్ష, దీక్షిత్‌గా గుర్తించారు.

'మంజీర'కు గర్భ శోకం!

- సిద్ధాపూర్, ఖండ్‌గావ్ క్వారీలో ఇసుక అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- ప్రభుత్వ ఆదాయానికి గండి

బోధన్, మే 13: నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లోని మంజీర తీరం ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. బోధన్ మండలం సిద్ధాపూర్‌లోని మంజీర తీరంలో ఇసుక క్వారీలో అడ్డూ అదుపులేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. అధికార పార్టీ నేతల అండ ఉందనే ధీమాతో అనుమతులు లేకపోయినప్పటికీ.. ఇసుకాసురులు అక్రమదందా సాగిస్తున్నారు. మంజీర నదీ గర్భంలోకి చొచ్చుకుపోయి నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాల జరుపుతున్నారు. కొన్ని నెలలుగా ఖండ్‌గావ్ క్వారీలో నిబంధనలను బేఖాతర్ చేస్తూ ఇసుక తవ్వకాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్వారీ ద్వారా ఇప్పటికే ఇసుకాసురులు అక్రమంగా రూ.కోట్లు సంపాదించారు. తాజాగా వారి కన్ను సమీపంలోని సిద్ధాపూర్ క్వారీపై పడింది. వాస్తవానికి ఈ క్వారీలో అప్పుడప్పుడు స్థానిక అవసరాల కోసం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చేవారు. మొదట్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించగా.. ఇప్పుడు టిప్పర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. రెండు క్వారీల్లో ఇసుక తవ్వకాలు ఏకకాలంలో చేపడుతుండటంతో టిప్పర్లు వచ్చి క్యూ కడుతున్నాయి. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

యంత్రాలతో ఇసుక తవ్వకాలు

సిద్ధాపూర్, ఖండ్‌గావ్ క్వారీలో కూలీలతో తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నా జేసీబీలను వినియోగిస్తున్నారు. సెలవు రోజుల్లో రెవెన్యూ అధికారులు వేబిల్లు ఇచ్చే పరిస్థితి ఉండదు. ఇటీవల సెలవు రోజున ఖండ్‌గావ్ క్వారీలో జేసీబీతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో బయటపడింది. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఓవర్‌లోడ్ వాహనాలతో ఇబ్బందులు

ఇక్కడి మంజీర తీరంలో ఇష్టమొచ్చినట్టుగా ఇసుక తవ్వుతున్నారు. రోడ్లు దెబ్బతినడమే కాక, లారీల వేగంతో రోడ్డెక్కాలంటే ప్రజలు భయపడుతున్నారు.

– మారయ్య, మాజీ సర్పంచ్, కల్దుర్కి, బోధన్ మండలం

అందాల రాశులేనా? ధాన్యం రాశులు పట్టవా?

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, లక్ష్మారెడ్డి. నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్ తదితరులు

- కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు పడిగాపులు
- కనీస వసతులు లేక వడదెబ్బ తో ధాన్యంపైనే రైతు మరణాలు
- అందాల పోటీల మీద సీఎం అధికారులతో తరచూ రివ్యూలు
- రైతుల సమస్యలపై త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): రైతులు తమ పంట అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందాల పోటీలపై మాత్రం రివ్యూల మీద రివ్యూలు నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటను అమ్ముకోవడానికి రైతులు 10-15 రోజులు కొనుగోలు కేంద్రాల్లో వేచి చూడాల్సిన దుస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రికి అందాల రాశులు తప్ప ధాన్యం రాశులు పట్టవా? అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక వడదెబ్బతో ధాన్యం రాశులపైనే రైతులు ప్రాణాలు వదులుతున్నారని, ఇవి ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు చనిపోతుంటే పట్టించుకోకుండా అందాల పోటీల మీద రివ్యూలు పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ధాన్యం కొన్న 48గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని చెప్పారని, 10 రోజులైనా డబ్బులు ఖాతాల్లో జమకావడం లేదని మండిపడ్డారు. తాలు, తరుగు పేరుతో క్వింటాకు 10 కిలోలు కోత పెడుతున్నారని, ఈ దోపిడీని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో రైతులు ఆందోళనలు చేపడుతున్నారని గుర్తుచేశారు. యాసంగిలో సన్నాలకు రూ.512 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉన్నదని, కానీ ప్రభుత్వం ఐదు పైసలు కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. రైతుల పక్షాన త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. తెలంగాణభవన్‌లో మంగళవారం మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు.

అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నరు

దేశం కోసం సరిహద్దుల్లో సైనికులు యుద్ధం చేస్తున్నారని, మరోవైపు రైతులు తమ పంట అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో యుద్ధం చేస్తున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. కొన్న ధాన్యానికి 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు వేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రగల్భాలు పలికారని, పది రోజులైనా దిక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్న వడ్లకు ప్రభుత్వం రూ.4 వేల కోట్లు రైతులకు బకాయి పడిందని మండిపడ్డారు. యాసంగిలో సన్నాలకు రూ.512 కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తరుగు తియ్యబోమని రేవంత్ అన్నారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ, క్వింటాకు 10 కిలోల తరుగు తీస్తున్నారని ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారని న్యూస్ క్లిప్పింగ్‌ను మీడియాకు చూపించారు.

వడ్ల రాశులపై ఊపిరి వదిలారు

కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కనీస వసతులు కల్పించకపోవడం వల్ల రోజుల తరబడి ఎండలో పడిగాపులు కాయడం వల్ల రైతులు పిట్టల్లా రాలిపోతున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. రైతు డిమాండ్ల సాధనకు రైతులపక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని హరీశ్ హెచ్చరించారు.

ఉత్తమ్ డైవర్షన్ పాలిటిక్స్

తాము ఆవేదనతో రైతుల సమస్యల గురించి మాట్లాడితే మంత్రి ఉత్తమ్ తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ్ మాట ప్రకారమే రాష్ట్రంలోని రైతాంగానికి రూ. 4వేల కోట్ల ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉన్నదని మంగళవారం ఎక్స్ వేదికగా గుర్తుచేశారు. 48 గంటల్లో ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి జాప్యం చేయడమెందుకని ప్రశ్నించారు. సన్నవడ్లకు చెల్లించాల్సిన రూ. 767 కోట్లలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదనే విషయాన్ని మంత్రి అంగీకరించినందుకు హరీశ్ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

పసుపు మార్కెట్‌లో మాయాజాలం!

- వ్యాపారుల జిమ్మిక్కులతో బలవుతున్న పసుపు రైతులు
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు

కొనుగోళ్ల సీజన్ ముగింపులో గరిష్ఠ ధరలు

ప్రారంభంలో అరకొరగానే గిట్టుబాటు ధర

నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు నిల్వలు

నిజామాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు రైతులు మోసపోతున్నారు. వ్యాపారులు, దళారుల మాయాజాలం.. రైతుల పొట్టకొడుతున్నది. ఏటా పసుపు కొనుగోళ్లలో ఈ తరహా దందా బహిరంగంగానే కొనసాగుతున్నది. వ్యాపారుల సిండికేట్ మహత్యమా? లేకపోతే పరిస్థితుల కారణమా? తెరవెనుక అభూత శక్తుల ప్రమేయమో తెలియదు కానీ చివరికి రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ పసుపు పంట కొనుగోళ్లకు పెట్టింది పేరు. ఉత్తర తెలంగాణలోని రైతులంతా లక్షలాది క్వింటాళ్ల పసుపును తీసుకువచ్చి అమ్ముకుంటారు. జనవరి నెలలో ఏటా పసుపు అమ్మకాలు ప్రారంభమవుతాయి. 2025 ప్రారంభంలో మొదలైన కొనుగోళ్లలో గరిష్ఠ ధర రూ.8 వేలు మించలేదు. రైతులు ఆందోళనలు చేయడంతో ప్రభుత్వ యంత్రాంగం జోక్యంతో రూ.9 వేలతో కొనుగోళ్లు అరకొరగా చేపట్టారు. ప్రస్తుతం కొనుగోళ్లు ముగిసే సమయంలో మార్కెట్‌లో ధర అమాంతం పెరిగింది. అయితే అమ్ముకునేందుకు రైతుల వద్ద పంట లేదు. పండించిన పసుపు ఇప్పటికే తక్కువ ధరకు విక్రయించిన వారంతా లబోదిబోమంటున్నారు.

ముగింపులో రూ.13,850

పసుపు కొనుగోళ్లు ముగింపు సమయంలో క్వింటాల్‌కు రూ.13,850 ధర పలుకుతున్నది. మార్కెట్‌కు మొన్నటి వరకు రోజుకు 30వేల క్వింటాళ్ల మేర పసుపు వచ్చేది. ఇప్పుడు గరిష్ఠంగా రోజుకు 800 నుంచి 900 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నది. పసుపు రాక మందగించడంతో వ్యాపారులు ధర పెంచి కొనుగోళ్లు చేపడుతున్నారు. వాస్తవానికి పసుపును పండించే రైతులంతా జనవరి, ఫిబ్రవరి నెలాఖరులోనే ప్రాసెసింగ్ చేపట్టి మార్కెట్‌కు తీసుకువస్తారు. ఇప్పుడు మార్కెట్‌కు చేరుకుంటున్న పసుపు పంట బడా వ్యాపారులకు సంబంధించినదిగా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ మాయాజాలంతో రైతులు నష్టపోతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

ప్రస్తుత ధరలు ఇలా..

నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు ఫింగర్ రకానికి గరిష్ఠ ధర రూ.13,850, కనిష్ఠ ధర రూ.9,527 పలుకుతున్నది. పసుపు బల్బ్ గరిష్ఠ ధర రూ.12,600, కనిష్ఠ ధర రూ.8,006 చొప్పున క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. చూర రకానికి గరిష్ఠ ధర రూ.11,801 పలుకుతున్నది.

మహారాష్ట్ర నుంచి పసుపు రాక

పసుపు ధర అమాంతం పెరిగిన ఈ సమయంలో లాభాలు మన ప్రాంత రైతులకు దక్కాల్సి ఉంది. విచిత్రంగా ధరలు పెరిగినప్పుడల్లా సామాన్యులకు ఆ ఫలాలు అందడం లేదు. ఈ అవకాశాన్ని పొరుగున ఉన్న మహారాష్ట్ర రైతులు అందిపుచ్చుకొంటున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి రైతులు పసుపు పంటను తీసుకువస్తున్నారు. ఇప్పుడు ఏకంగా క్వింటాలు పసుపు ధర రూ.14 వేలకు చేరువైంది. ఈ పరిస్థితులను గమనిస్తున్న రైతులు లబోదిబోమంటున్నారు. పసుపు బోర్డు తెచ్చామంటూ బీజేపీ గొప్పలు చెబుతుండగా గిట్టుబాటు ధర కల్పించడంలో చొరవ తీసుకోకపోవడంపై పసుపు రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి పసుపు తెచ్చిన

సంతోష్ మంగల్, ముద్కేడ్, మహారాష్ట్ర

నిజామాబాద్‌లో ధర వస్తుందని తెలుసుకున్నా. మొత్తం 140 బస్తాలు తీసుకువచ్చిన. సుమారు 80 క్వింటాళ్ల వరకు ఉంటుంది. క్వింటా ధర రూ.13 వేలు చెబుతున్నారు. మొన్నటి వరకు రూ.10 వేలు కూడా రాలేదు. అందుకే ఇప్పుడు అమ్ముకుంటున్నా. ఒకటే ధరను పెడితే రైతులకు లాభం ఉంటది. ధరల్లో హెచ్చుతగ్గుదలతో రైతులకు నష్టం జరుగుతుంది.

– సంతోష్ మంగల్, ముద్కేడ్, మహారాష్ట్ర